షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు  తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152
1st Year Happy Work Anniversary.
Good for Health
Best for Readers
సంపుటి : 3 సంచిక : 50 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు
VOLUME : 03 ISSUE : 50 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Friday 20 February 2026 PAGES : 8 PRICE : 3/-


## త్వరలో మరో డీఎస్సీ ప్రకటిస్తాం: శాసన సభలో శుభవార్త చెప్పిన నారా లోకేశ్

**సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగుల వేతనాల పెంపుదలపై చర్చిస్తామన్న మంత్రి**




**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 19)**
త్వరలో డీఎస్సీని ప్రకటిస్తామని, అలాగే సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగుల వేతనాల పెంపుదలపై బోర్డు సమావేశంలో చర్చిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసన సభలో ఎమ్మెల్యేలు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు.

**ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు సమావేశంలో చర్చిస్తాం**
సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న -మిగతా 2లో

## ఏఐ మనల్ని కాదు.. మనం ఏఐని శాసించాలి: ప్రధాని మోదీ

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 19)**



కృత్రిమ మేధ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలన్నారు. దేశ రాజధాని దిల్లీలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'లో ప్రధాని మోదీ గురువారం ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు.

**ఏఐకి పరివర్తన శక్తి..** "ప్రపంచంలోనే ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉంది. కొత్త సాంకేతికతను -మిగతా 2లో

## హెరిటేజ్ సంస్థ నోటీసులు ఇచ్చినా బుద్ధి మార్చుకోవడం లేదు

**బొత్సపై అచ్చెన్న ఫైర్**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 19)**
ఏపీ శాసనమండలి సమావేశాల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. సభలోకి విజిల్స్ తీసుకొచ్చిన వైసీపీ సభ్యులు... ఛైర్మన్ పోడియం వద్ద విజిల్స్ వేస్తూ హంగామా సృష్టించారు. ఈ క్రమంలో సభ కాసేపు వాయిదా పడంది. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్‌కు ఎలాంటి సంబంధం లేదని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. వైసీపీ ఎమ్మెల్సీలు ఎలాంటి ఆధారాలు లేకుండా ఆందోళన చేస్తున్నారని, హెరిటేజ్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇలాంటి అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బొత్స సత్యనారాయణ మీడియా సమావేశంలో చీజ్ ప్యాకెట్ చూపిస్తూ నెయ్యి అని చెబుతున్నారని... సీనియర్ నేత అయిన బొత్సకు నెయ్యికి, చీజ్ కు తేడా తెలియదా? అని ఎద్దేవా చేశారు.
అసత్య ప్రచారం చేస్తున్న బొత్సకు హెరిటేజ్ సంస్థ నోటీసులు కూడా ఇచ్చిందని అచ్చెన్నాయుడు తెలిపారు. అయినా ఆయన బుద్ధి మార్చుకోవడం లేదని... ఇది మన దౌర్భాగ్యమని అన్నారు. హెరిటేజ్ కు, ఇందాపూర్ డెయిరీకి మధ్య సంబంధం ఉన్నట్టు ఏ ఆధారాలు ఉన్నా తీసుకురావాలని అన్నారు. ఏపీలోనే కాకుండా ఏ రాష్ట్రంతో కూడా వ్యాపార లావాదేవీలు జరపకూడదనే నిర్ణయాన్ని హెరిటీజ్ తీసుకుందని చెప్పారు. వైసీపీ సభ్యులు ప్రతిరోజూ ఒకే అంశంపై వాయిదా తీర్మానాన్ని ఇస్తూ శాసనమండలి -మిగతా 2లో

## కులం, మతం, ప్రాంతీయ వివక్షతో వ్యక్తులపై దాడులు తిరోగామి చర్యలే



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 19)**
జాతి, మతం, కులం, ప్రాంతం ఆధారంగా వ్యక్తులను గుర్తించి వివక్ష చూపడం, హింసాత్మక దాడులకు పాల్పడడం తిరోగామి చర్యలేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిన తర్వాత కూడా ఇలాంటి వివక్ష కొనసాగడం శోచనీయమని తెలిపింది. ఈ నేరాల పట్ల కఠినంగా వ్యవహరించి వాటిని నిరోధించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ ధర్మాసనం పేర్కొంది. ఈశాన్య ప్రాంత ప్రజలపై దేశంలోని వివిధ చోట్ల జరుగుతున్న వివక్షాపూరితమైన హింసను నిరోధించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని తోసిపుచ్చుతూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే, -మిగతా 2లో

# ఉప్పాడ మత్స్యకారుల అభ్యున్నతికి ప్రణాళిక సిద్ధర్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 19)**
ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార సోదరుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా సమగ్ర ప్రణాళికను రూపొందించినట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రణాళికలకు రూపొందించినట్లు చెప్పారు. "గతేడాది అక్టోబర్ 9వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు అన్వేషించాం. తీర కాలుష్య నివారణ, కోత నివారణ, మత్స్య సంపద వృద్ధి, అధునాతన పద్ధతుల్లో వేట, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ, ఇలా మత్స్యకారుల జీవితాలకు భద్రత, భరోసా కల్పించేందుకు అవసరమైన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికలో పొందుపర్చాం. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడంతోపాటు వ్యవసాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన తదితర అంశాలను కూడా పరిగణలోకి తీసుకున్నాం" అని ఆయన అన్నారు.
వివిధ శాఖల ఉన్నతాధికారులు, మెరైన్ ఫిషరీస్ నిపుణులు, జిల్లా అధికారుల సహకారంతో రూపొందించిన ఈ ప్రణాళికను త్వరలో పిఠాపురం పర్యటనలో ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిర్దిష్ట లక్ష్యంతో రూపొందించిన ప్రణాళిక - ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

## భారత్‌లో మార్పుల వేగానికి ఆశ్చర్యపోతున్నా

**సుందర్ పిచాయ్**




**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 19)**
ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. దిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోందని, ఏఐ కేంద్రంగా మారుతోందని ప్రశంసించారు.
"కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను వృద్ధి పథంలో నడిపిస్తాయి. ఏఐ నిర్మాణం అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ మార్పుల వేగం చూసి ఆశ్చర్యపోతున్నా. విద్యార్థిగా ఉన్నప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు విశాఖ మీదుగా వెళ్లేవాడిని. అదే విశాఖ తీరంలో ఇప్పుడు గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటవుతోంది" అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు.

**ఏ దేశానికీ సాధ్యం కానిది భారత్ చేసింది: మెక్రాన్**
"డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోంది. గతంలో భారత్‌లో బ్యాంకు ఖాతా తెరవాలంటే సమస్యగా ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పత్రాలు లేకుండానే బ్యాంకు ఖాతా తెరవగలుగుతున్నారు. ఫోన్‌లోనే బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం వచ్చింది. 140 కోట్ల మంది ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీ తీసుకొచ్చింది. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకు సాగాలి. ప్రతినెలా 20 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. 500 మిలియన్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీలు ఇచ్చారు" అని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ప్రశంసించారు. -మిగతా 2లో

## మానవ సేవే పరమావధిగా ఇస్కాన్ ప్రయాణం

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 19)**



సనాతన ధర్మ విలువలను ప్రపంచ దేశాలకు చేరవేయడంలో ఇస్కాన్ సంస్థ కీలకంగా పనిచేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ మానవ సేవే పరమావధిగా ముందుకు వెళుతోందని కొనియాడారు. పశ్చిమ బెంగాల్‌లో పర్యటిస్తున్న ఆయన.. నదియా జిల్లా మాయాపుర్‌లోని ఇస్కాన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకుర్ 152వ జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాట్లాడుతూ.. తాను ఇక్కడకు ప్రభుత్వ ప్రతినిధిగా రాలేదని.. చైతన్య మహాప్రభు భక్తునిగా వచ్చానని పేర్కొన్నారు. "దేశంలో పర్యటిస్తున్నప్పుడు ఇస్కాన్ ప్రభావాన్ని గమనించాను. మీరు ప్రచురించిన భగవద్గీత అన్ని వయసుల వారికి, అన్ని వర్గాల వారికీ అక్కరకు వస్తోంది. అయితే భక్తి దగ్గరే ఇస్కాన్ ఆగిపోలేదు. ఎక్కడైనా విపత్తు తలెత్తితే అక్కడకు వెళ్లి చేయందించే మొట్టమొదటి సంస్థగా నిలుస్తోంది. ఆహార పంపిణీ శిబిరాలు ఏర్పాటు, విద్య, వైద్య రంగాలను పేదవారికి చేరువ చేయడానికి అనేక కార్యక్రమాలను చేపడుతోంది' అని అమిత్ షా కొనియాడారు.

## హిందూపురంలో బాలకృష్ణ పర్యటన.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**లేపాక్షి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన బాలకృష్ణ**
**మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు బీటీ రోడ్డు పనులకు భూమిపూజ**
**రూ.2.60 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణం**
**పులమతి చెరువులో హంద్రీనీవా జలాలకు జలహారతి ఇచ్చిన ఎమ్మెల్యే**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 19)**
శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురువారం లేపాక్షి మండలంలో పర్యటించిన ఆయన, రెండు కీలకమైన బీటీ రహదారుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.వివరాల్లోకి వెళ్తే, మండలంలోని మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి వరకు రూ.2.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను బాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. -మిగతా 2లో

## అనుమతి లేకుండా భారత్ వీడను: అనిల్ అంబానీ

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 19)**



ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ గురువారం సుప్రీం కోర్టుకు తెలిపారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ప్రమేయం ఉన్న రూ.40 వేల కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసుల్లో ఏజెన్సీల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనిల్ అంబానీ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని, ఈ కేసుల్లో సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని కోరుతూ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన పిల్‌కు ప్రతిస్పందనగా ఆయన ఈమేరకు అఫిడవిట్ దాఖలు చేశారు."ఈ కేసుల్లో దర్యాప్తు మొదలు.. గతేడాది జులై నుంచి నేను దేశం విడిచి వెళ్లలేదు. ప్రస్తుతానికి విదేశాలకు వెళ్లే ఉద్దేశం, ప్రణాళికలేవీ లేవు. -మిగతా 2లో

## 'అందరికీ ఏఐ'లో భారత్ కృషికి మద్దతు



**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 19)**
ఏఐని ప్రజాస్వామ్యీకరించి.. అన్ని దేశాలకు సమాన అవకాశాలను కల్పించేందుకు భారత్ చేస్తున్న కృషికి సంపూర్ణ మద్దతు ఇస్తామని స్విట్జర్లాండ్ అధ్యక్షుడు పర్మెలిన్ పేర్కొన్నారు. ప్రతి దేశానికీ కీలక సాంకేతికతలతో ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను ఆయన స్వాగతించారు. సరిహద్దుల ఆవలకు డేటా సరఫరా చేయడానికి మద్దతిస్తామని, అది డిజిటల్ టెక్నాలజీల ప్రయోజనాలను అందరికీ అందించడానికి ఉపయోగపడుతుందని, అయితే అదే సమయంలో డేటా సార్వభౌమత్వాన్ని కాపాడటానికి నిబంధనలను పాటించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఏఐ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీకి వచ్చిన ఆయన బుధవారం పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. తదుపరి ఏఐ సమిట్‌ను స్విట్జర్లాండ్ నిర్వహించే అవకాశముంది. -మిగతా 2లో

# ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అపరాలు కొనుగోలు చేయాలి

## జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భావన వశిష్ట

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 19)




శనగలు, మినుములు, పెసలను ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. కొనుగోలు



కేంద్రాల ఏర్పాటుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. శనగల కొనుగోలు కేంద్రాలను మార్చి ఒకటో తేదీ నుంచి జిల్లాలో ప్రారంభించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 20 రైతు సేవా కేంద్రాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. శనగ పంటను జిల్లాలో 38,840 హెక్టార్లలో రైతులు సాగు చేశారన్నారు. 35,901 హెక్టార్లలో శనగ పంటను ఈ క్రాప్ నమోదు చేసినట్లు వివరించారు. వాటి ఆధారంగా జిల్లావ్యాప్తంగా 73,860 మెట్రిక్ టన్నుల శనగ పంట దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఒక క్వింటా శనగలకు రూ.5,875లు కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. బాపట్ల జిల్లాలోని రైతుల నుంచి 12,116 క్వింటాళ్ల శనగలను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు ఆమె మార్గ నిర్దేశం చేశారు. శనగలు, మినుము, పెసర పంటలు సాగు చేసిన రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వమే కనీస మద్దతు ధర కల్పిస్తుందని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. మొదటిగా రబీ సీజన్ లో శనగ పంట కొనుగోలుకు సన్నాహాలు చేయాలన్నారు. తేమ యంత్రాలు, గోనె సంచులు, టార్పాలిన్ పట్టలను సిద్ధం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన అపరాలు గోదాములకు తరలించేలా వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే వాహనాల రవాణా చార్జీలు, హమాలీల ధరలను తక్షణమే నిర్ణయించాలన్నారు. అపరాలు సేకరించే సిబ్బందికి నాణ్యమైన శిక్షణ ఇవ్వాలన్నారు. కొనుగోలు కేంద్రాలు సజావుగా సాగేలా అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. ఒక రైతు 40 క్వింటాళ్ల శనగలను ఒక రోజులోనే కొనుగోలు కేంద్రం వద్ద అమ్ముకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ విషయాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రతి రైతు సేవా కేంద్రాల పరిధిలో ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ ఏడి కరుణశ్రీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారిని విజయనిర్మల, పౌర సరఫరాల సంస్థ జిఎం శ్రీలక్ష్మి, జిల్లా రవాణా అధికారి పరంధామరెడ్డి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు వేతనాలు బకాయిలు చెల్లించాలి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 19)

పొదిలి నగర పంచాయతీ మున్సిపల్ కార్మికులకు గత మూడు నెలలుగా ఇవ్వాల్సిన జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం మేనేజర్ షేక్షావలికి కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పొదిలి నగర పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు యన్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గత మూడు నెలలకు పైగా కార్మికులు జీతాలు లేకుండా పనులు చేస్తూ పండగ పూటలు కూడా పస్తులు ఉంటున్నారన్నారు. పంచాయతీలో నిధులు లేవనే సాకుతో గత మూడు నెలలకు పైబడి కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో అతి ముఖ్యమైన క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి, మహా శివరాత్రి పండుగలు సైతం అర్ధాకలితో, పస్తులతో జరుపుకున్నారన్నారు. నగర పంచాయతీలో సిబ్బంది కొరత వల్ల ఇంటి పన్నులు వసూలు కావడం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మార్చి నాటికి నాలుగు నెలల బకాయిలు పూర్తిగా చెల్లించాలని అధికారులను డిమాండ్ చేశారు. ప్రతిసారి ఒక నెల వేతనం పేరుతో ఇచ్చే డబ్బులు కార్మికుల అప్పులు తీర్చడానికి సరిపోడం లేదన్నారు. ఒకేసారి మొత్తం జీతాలు చెల్లించాలని, పండుగ అలవెన్స్ రూ.1,000, సమ్మె కాలపు బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికులు జి నాగేశ్వరరావు, కె వి నరసింహా, జి రాజయ్య, పి నాగేంద్రమ్మ, జార్జి, గాలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# హెరిటేజ్ సంస్థ నోటీసులు ఇచ్చినా బుద్ధి మార్చుకోవడం లేదు

సమయాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని సాక్షి, భారతి సిమెంట్స్ ద్వారా ప్రజల సొమ్మును జగన్ దోచుకున్నారని... జగన్ మాదిరి హెరిటేజ్ ఎప్పుడూ చేయదని అన్నారు. ఆధారాలు లేకుండా సమాధానం చెప్పాలంటే ఏం చెప్పాలని ప్రశ్నించారు. సభకు ఆటంకం కలిగిస్తున్న వైసీపీ సభ్యులపై మండలి చైర్మన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

# త్వరలో మరో డీఎస్సీ ప్రకటిస్తాం: శాసన సభలో శుభవార్త చెప్పిన నారా లోకేశ్

ఉపాధ్యాయులు, డీటీపీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి జీతాల పెంపుదలపై వచ్చే ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు సమావేశంలో చర్చిస్తామని, కేంద్రంతోను కూడా సంప్రదిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు.శాసనసభలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడకుదిటి ఈశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ, సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డీటీపీ ఆపరేటర్ల జీతాలు దక్షిణ భారతంలోని తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలతో పోలిస్తే ఏపీలోనే అత్యధికంగా ఉన్నాయని అన్నారు. గతంలో 3 నెలలకోసారి జీతాలు ఇవ్వగా, ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన వారికి జీతాలు చెల్లిస్తున్నట్లు చెప్పారు.సమగ్ర శిక్ష అనేది సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్ అని, ఇందులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందని వెల్లడించారు. అందువల్ల ఏ నిర్ణయం తీసుకున్నా కేంద్రప్రభుత్వ ఆమోదంతోనే తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

### సీజన్ హాస్టళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటాం

కర్నూలు జిల్లాలో సీజనల్ హాస్టళ్లు పెంచాలన్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి చేసిన విజ్ఞప్తిపై మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ, కర్నూలు జిల్లాలో అవసరమైన మేర నూటికి నూరు శాతం సీజనల్ హాస్టళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

యువగళం పాదయాత్ర సందర్భంగా ఆలూరు, ఆదోని, మంత్రాలయంలో పర్యటించినపుడు ఆ ప్రాంతం ఎంత వెనుకబడి ఉందో ప్రత్యక్షంగా చూశానని అన్నారు. నంద్యాల, కర్నూలు పార్లమెంటు నడుమ ఎంతో వ్యత్యాసం కనిపించిందని తెలిపారు. నిన్న జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో కర్నూలు పార్లమెంటు పరిధిలో వస్తున్న పరిశ్రమలకు అదనపు ఇన్సెంటివ్స్ ము కూడా ప్రజాప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించారు.

ఆ ప్రాంతంలో పెద్దఎత్తున పెట్టుబడులు తెచ్చే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని అన్నారు. గత ఏడాది జరిగిన డీఎస్సీలో కూడా కర్నూలు జిల్లాకు ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ టీచర్ - స్టూడెంట్ రేషియో అక్కడ తక్కువగా ఉందని అన్నారు. త్వరలో మరో డీఎస్సీ ప్రకటించబోతున్నామని శుభవార్త చెప్పారు. అందులో కర్నూలు పార్లమెంటుపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామని, ఆ ప్రాంతంలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు.

# ఏఐ మనల్ని కాదు.. మనం ఏఐని శాసించాలి: ప్రధాని మోదీ

అందిపుచ్చుకుంటోంది. కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్ ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుంది. కృత్రిమ మేధకు పరివర్తన శక్తి ఉంది. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుంది. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో ఉన్నాం. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న. ప్రజల సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు. మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలి. కృత్రిమ మేధ మనల్ని కాదు.. మనం ఏఐని శాసించాలి" అని మోదీ వివరించారు.

# కులం, మతం, ప్రాంతీయ వివక్షతో వ్యక్తులపై దాడులు తిరోగామి చర్యలే

పిటిషన్‌లోని అంశాలను పరిశీలించి సంబంధిత ప్రభుత్వ విభాగానికి పంపించి చర్యలు తీసుకునేలా చూడాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని ఆదేశించింది. త్రిపురకు చెందిన 24 ఏళ్ల ఎంబీఏ విద్యార్థి దేహ్రాదూన్‌లో దారుణ హత్యకు గురైన నేపథ్యంలో గత ఏడాది డిసెంబరు 28న ఈ వ్యాజ్యం దాఖలైంది.

# భారత్‌లో మార్పుల వేగానికి ఆశ్చర్యపోతున్నా

### ఏఐ వాస్తవం: చంద్రశేఖరన్

"ఏఐ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోంది. 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థ కలిగిఉంది. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని తీర్చిదిద్దుతున్నారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోంది. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోంది. ఏఐ కృత్రిమమైనది కాదు.. వాస్తవమైనది" అని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు.

### భారత్‌ది కీలక పాత్ర: డారియో

"గత దశాబ్దకాలంగా ఏఐ వేగంగా ముందుకెళ్తోంది. అతి త్వరలోనే మనుషులు చేసే అత్యంత క్లిష్టమైన పనులను ఏఐ మోడళ్లు సులువుగా పూర్తి చేసే రోజులు రానున్నాయి. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుంది" అని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు.

# అనుమతి లేకుండా భారత్ వీడను: అనిల్ అంబానీ

ఒకవేళ విదేశీ ప్రయాణం చేయాల్సి వస్తే.. కోర్టు నుంచి ముందస్తు అనుమతి తీసుకుంటాను. సంబంధిత కేసుల్లో దర్యాప్తు సంస్థలకు అత్యంత నిజాయతీతో పూర్తిగా సహకరిస్తున్నాను. ముమ్ముందు కూడా కొనసాగిస్తాను" అని అనిల్ అంబానీ తెలిపారు. చట్ట ప్రక్రియ నుంచి తప్పించుకునే ఉద్దేశం తనకు లేదని, తాను అలాంటి వ్యక్తిని కాదని పేర్కొన్నారు.ఏఐలో జియో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు: ముకేశ్ అంబానీ

మనీలాండరింగ్ కేసులో ఈ నెల 26న విచారణకు హాజరు కావాలని ఈడీ (జుఅటశీతీషవవఎవత్ ణఱతీవషశీతీథ్వ) సమన్లు జారీ చేసిందని, హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన ప్రవర్తన పారదర్శకంగా, కేసుల దర్యాప్తునకు సహకరించే విధంగా ఉందని చెప్పేందుకే ఈ అఫిడవిట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ కేసుల దర్యాప్తులో జాప్యంపై ఈ నెల 4న సుప్రీం కోర్టు (ాబజూతీవఎవ జశీబతీ) అసంతృప్తి వ్యక్తం చేసింది. దర్యాప్తును ముమ్మరం చేయాలని సీబీఐ (జదీ×), ఈడీలను ఆదేశించింది.

# 'అందరికీ ఏఐ'లో భారత్ కృషికి మద్దతు

'భారత్‌లో నిర్వహిస్తున్న ఏఐ సమిట్.. రూపొందించే నిబంధనావళి సరైన మార్గదర్శనం చేయనుంది. అలాగే స్వచ్ఛంద సహకారం కోసం ఇక్కడ నిర్మించే వారధులు లక్ష్యాన్ని సాధించేందుకు సహాయపడతాయి. అత్యధిక వేతనాలున్న దేశాల్లో ఉత్పత్తి వ్యయాన్ని ఏఐ గణనీయంగా తగ్గించగలిగితే ఎగుమతులు చౌకగా ఉంటాయి. ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని కార్మిక మార్కెట్లపై ఒత్తిడి పెరుగుతుంది. అటువంటి షాక్‌లను ట్రేడ్ పాలసీల ద్వారా సరిచేయవచ్చు' అని పర్మెలిన్ పేర్కొన్నారు. 'భారత్, స్విట్జర్లాండ్‌ల మధ్య సంబంధాలు అద్భుతంగా ఉన్నాయి. 2024లో 75 ఏళ్ల స్నేహాన్ని సెలబ్రేట్ చేసుకున్నాం. ఇంకా అనేక రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయి. వీటిని వినియోగించుకోవడానికి నా పర్యటన దోహదం చేయనుంది. పారిశ్రామిక సామర్థ్యంపై రెండు దేశాల ఆర్థిక సంబంధాలు ఆధారపడి ఉన్నాయి. స్విట్జర్లాండ్ నుంచి యంత్రాలు, ఔషధాలు, రసాయన ఉత్పత్తులు, విలువైన పరికరాలు, మెడికల్ టెక్నాలజీలు, వాచ్‌లను ఎగుమతి చేస్తున్నాం. భారత్ నుంచి రసాయనాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్స్, ఇతర పారిశ్రామిక ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాం' అని వివరించారు.

# హిందూపురంలో బాలకృష్ణ పర్యటన.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ఈ రహదారి పూర్తయితే స్థానిక గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరుతాయని తెలిపారు. అనంతరం ఆయన పులమతి చెరువు వద్దకు చేరుకుని, హంద్రీనీవా జలాలకు ప్రత్యేక పూజలు చేసి జలహారతి ఇచ్చారు. ఇదే పర్యటనలో భాగంగా కొత్తపల్లి నుంచి నాగేపల్లి వరకు నిర్మించనున్న మరో రహదారి పనులకు కూడా బాలకృష్ణ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలో రవాణా, సాగునీటి రంగాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా బాలకృష్ణ స్పష్టం చేశారు.

# శ్రీ వాసవి నిత్య అన్నదాన సత్రం, కళ్యాణ మండపంకు సహకరించిన దాతలకు ఘన సన్మానం

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 19)



కడప జిల్లా ఒంటిమిట్టలో శ్రీ వాసవి కోదండరామస్వామి ఆర్యవైశ్య నిత్య అన్నదానశీ సత్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె,వి సుబ్బారావు, అడ్వకేట్ పత్తి నాగేంద్రప్రసాద్, వల్లం కొండు వెంకటరమణ, తుమ్మలపెంట సురేష్ బాబు, సి,వి నాగేశ్వరరావు, జొన్నలగడ్డ సుధాకర్ (వస్త్రం) తుమ్మలపెంట రామకృష్ణ సృజన్, చాటకొండు వెంకటసుబ్బయ్య, కొలిశెట్టి సుబ్రహ్మణ్యం, చాటుకొండ సుబ్బారావు తో పాటు పలువురు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు, ప్రారంభోత్సవంలో పాల్గొన్న పలువురికి వాసవి అన్నసత్రం అధ్యక్షులు బచ్చు రాజా, సెక్రటరీ సుంకు సిద్దయ్య, టేజరర్ రామచంద్రయ్య, వైస్ ప్రెసిడెంట్ సుంకు చిన్న సిద్దయ్య, జాయింట్ క్యాషియర్ బింగు సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ కొప్పరపు గురు ప్రసాద్,ముచ్చెర్ల శేషయ్య తోపాటు పలువురు కమిటీ సభ్యులు ప్రత్యేక శాలువాతో సత్కరించి వాసవి మాత అమ్మవారి మెమెంటోన్ అందజేశారు, పలువురు బద్వేల్పురాంత ఆర్యవైశ్యులు ప్రత్యేక హోమాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా బద్వేల్ పట్టణానికి చెందిన కే,వీ సుబ్బారావు, సివి నాగేశ్వరరావు తో పాటు పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచినటువంటి కోదండరామస్వామి దేవా ఆలయం స్వామి దర్శించుకునేందుకు విచ్చేయుచున్న భక్తులను ఆర్యవైశ్యులను దృష్టిలో పెట్టుకొని కడప జిల్లా ప్రాంతంలో అనేకమంది ఆర్యవైశ్యుల దాతల సహాయ సహకారాలతో సుమారు నాలుగు కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం, కళ్యాణ మండపం నూతన ప్రారంభోత్సవాన్ని అత్యంత తక్కువ సమయంలోనే నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు, భక్తులు అందరికీ అవసరమైన రూములు మరియు భోజనాలు ప్రతిరోజు అందుబాటులో ఉండే విధంగా అన్న సత్రం మరియు నిరుపేద వైశ్యులు వివాహాలు జరుపుకునేందుకు అనువుగా కళ్యాణ మండపం కూడా ఏర్పాటు చేయడం సంతోషకర్మన్నారు,ఈ అవకాశాన్ని ఆర్యవైశ్యులు అందరూ వినియోగించుకోవాలని వారి సేవలను పలువురు అభినందనలు తెలిపారు, అనంతరం అన్న సత్రం మరియు కళ్యాణమండపం అందులో నిర్మాణం చేపట్టిన రూముల దాతలు అందరికీ వారు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బద్వేల్ పట్టణానికి చెందిన పలువురు శ్రీ కోదండరామ స్వామి వారిని దర్శించుకున్నారు.














షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

20.02.26 శుక్రవారం



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

చస్తేనే స్పందిస్తారా....?

పుల్లలచెరువులో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఫిబ్రవరి 10)
ప్రజలెవరైనా చస్తేనే గాని స్పందించే పరిస్థితిలో పుల్లలచెరువు విద్యుత్‌శాఖ అధికారులు ఉన్నారు. వివరాల్లోకి వెళితే పుల్లలచెరువు మండల కేంద్రంలోని రాములవారి గుడి పక్కన ఉన్న 11 కేవీ ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. 24 గంటల విద్యుత్ సరఫరా కొనసాగుతున్న ఈ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంప చెట్లు, పిచ్చి పొదలు అడవిలా పెరిగిపోయినా అధికారులు మాత్రం కళ్లున్నా అవి కనపడనట్లు (గుడ్డివారిలా) వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కంప చెట్లు కరెంటు తీగలకు తగులుతూ నిత్యం చిటపటమంటూ స్పార్కులు వస్తున్నా, (తరువాయి 4లో...)

# సగం పని మాత్రమే చేస్తాం...
## మమ్మల్ని అడిగేదెవరూ?

సగం పని చేస్తే అర్థం ఏమిటి..?

మళ్లీ అదే ప్రమాదానికి బాటలా?

విద్యుత్ శాఖ తాత్కాలిక చర్యల పై స్థానికుల సందేహాలు

షణ్ముఖ వెలుగు దినపత్రిక కథనానికి ఎట్టకేలకు కదిలిన విద్యుత్‌శాఖ

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఫిబ్రవరి 19)
మండల కేంద్రంలోని రాముల వారి గుడి పక్కన ఉన్న 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నెలకొన్న ప్రమాదకర పరిస్థితి పై ఈ నెల 10వ తేదీన షణ్ముఖ వెలుగు దినపత్రికలో "చస్తేనే స్పందిస్తారా?" అనే పేరుతో శీర్షిక ప్రచురితమైంది. ఎట్టకేలకు వారం రోజుల తర్వాత కథనానికి విద్యుత్ శాఖ స్పందించింది. గురువారం విద్యుత్‌శాఖ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో శుభ్రపరిచే పనులు చేపట్టారు. ట్రాన్స్ఫార్మర్ చుట్టూ పెరిగిన చెట్లు, పొదలను కొంతమేర తొలగించినప్పటికీ పూర్తి స్థాయిలో శుభ్రపరిచే చర్యలు చేపట్టలేదని స్థానికులు పేర్కొంటున్నారు. తొలగించిన చెట్ల కొమ్మలు, చెత్త చెదారం, వేర్లు, పచ్చి మొద్దులు అక్కడికక్కడే వదిలేయడం అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే పరిస్థితి పై షణ్ముఖ వెలుగు దినపత్రిక నిరంతరం దృష్టి సారించడంతో అధికారులు కదిలినప్పటికీ, తీసుకున్న చర్యలు తాత్కాలికంగానే మిగిలాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకంగా పచ్చి మొద్దులు అలాగే ఉండటంతో రాబోయే రోజుల్లో మళ్లీ చెట్లు పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద సూచనలు ఉన్న ప్రాంతంలో అర్ధాంతర చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం అవసరమని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరలా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు పరిసరాలను పరిశీలించి పూర్తిగా శుభ్రపరచి, భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


"నరికిన చెట్లు, మొద్దులు తీయకుండా వదిలేసిన ప్రాంతం"



# ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు ముందస్తుగా ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి జిల్లా రాక నేపధ్యంలో అత్యంత పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 19)
ఈ నెల 25వ తేదీన దోర్నాల మండలంలోని సొరంగాల నుంచి సాగర్ జలాశయానికి నీటిని తరలించే ఫీడర్ కెనాల్ శంకుస్థాపన కార్యక్రమం జరగనున్న నేపధ్యంలో గంటావానిపల్లి, కొత్తూరు గ్రామాల్లో ముందస్తు భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబు, జిల్లా అధికారులు


4

# ఈతకి వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి


4



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 19)
మండలంలోని మంగపతి వారిపాలెం గ్రామానికి చెందిన మల్లె బోయిన శ్రీ చరణ్ గురువారం ఈతకు వెళ్లి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. అయితే ఇటీవల మహాశివరాత్రి సందర్భంగా ఇంటికి వచ్చాడు. గురువారం సాయంత్రం మళ్లీ కళాశాలకు వెళ్లటానికి సిద్ధపడిన శ్రీ చరణ్ గ్రామ శ్రీవారిలోని పొలం దగ్గర ఉన్న తన తండ్రి రామారావు చెప్పి వస్తానని పొలం దగ్గరకు వెళ్ళాడు. తండ్రితో మాట్లాడిన శ్రీ చరణ్ బయటికి వెళ్లి మళ్లీ వస్తానని చెప్పి పక్కనే ఉన్న గొరిసెల వాగు దగ్గరికి వెళ్ళాడు.

# లోకేష్ డిన్నర్...ఫుల్ జోష్

వేడుకలా ఒంగోలు, బాపట్ల పార్లమెంటు ప్రజా ప్రతినిధుల ఆత్మీయ కలయిక




4

# నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కందుల వసంతలక్ష్మి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 19)
రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఏదో ఒక కొత్త విధానానికి పూనుకోవడం పరిపాటి. అందులో భాగంగా మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తరుపున గెలిచిన ఎమ్మెల్యేలందరి కుటుంబ సభ్యులతో కలిసి ఓ ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నడుం బిగించారు. అందులో భాగంగా మంగళగిరిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆయన సతీమణి కందుల వసంతలక్ష్మిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌తో నియోజకవర్గ సమస్యల పై కందుల నారాయణరెడ్డి చర్చించారు. అనంతరం కందుల నారాయణరెడ్డి, కందుల వసంతలక్ష్మిలు ఇద్దరూ కలిసి ఆయనతో ఫోటోలు దిగారు.





# రాష్ట్రవ్యాప్తంగా 22,30,730 ఉచిత వ్యవసాయ కనెక్షన్లు

ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఫిబ్రవరి 19)
రాష్ట్రవ్యాప్తంగా 22,30,703 ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అసెంబ్లీలో ప్రకటించారు. అసెంబ్లీలో గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ తో పాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు డిస్కంల పరిధిలో 1,02,538 కొత్త ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అయితే



మరో 46 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి గొట్టిపాటి తెలిపారు. వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లను కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో మూడు డిస్కంల పరిధిలో రూ.839.44 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రంలో ఇప్పటివరకు 2,61,481 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఫీడర్ లెవల్ సోలార్ ప్రాజెక్టుల అమలుతో విద్యుత్ కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1059 కోట్లు ఆదా అవుతుందని పేర్కొన్నారు. 11 కేవీ లైన్ల దగ్గర సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా వినియోగదారులకు (తరువాయి 4లో...)

# లోకేష్ డిన్నర్...ఫుల్ జోష్







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 19)

నిత్యమూ రాజకీయాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, నియోజకవర్గ సమస్యలతో క్షణం తీరికలేకుండా గడిపే ప్రజా ప్రతినిధులను మంత్రి నారా లోకేష్ ఓ మూడు గంటల పాటు ఇవేమీ సంబంధంలేని సరికొత్త ఆనంద ప్రపంచంలో ఉంచారు. మంత్రి నారా లోకేష్ గురువారం రాత్రి ఉండవల్లి నివాసంలో ఇచ్చిన విందుకు ఒంగోలు, బాపట్ల కూటమి ప్రజా ప్రతినిధులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. వీరిని లోకేష్ ఆత్మీయంగా ఆహ్వానించారు. నో పాలిటిక్స్..నో అసెంబ్లీ డిస్కషన్స్..సరదా సంభాషణలు..ఆట పట్టించుకోవడం.. ఫుల్ జోష్ తో సాగింది విందు. నేతలు ఒకరికొకరు బాగా పరిచయం ఉన్నా..కుటుంబ సభ్యుల మధ్య అంతగా పరిచయం ఉండదు. ఈ ఆత్మీయ కలయిక నేతల కుటుంబ సభ్యులనూ కలిపింది. మహిళలు, పిల్లలు చక్కగా కలిసి మెలిసి మాట్లాడుతూ ఎంజాయ్ చేశారు. వివిధ సమస్యలు, అభివృద్ధి పనుల కోసం ప్రజా ప్రతినిధులు ఇచ్చిన గ్రీవెన్స్ స్టేటస్ రిపోర్టును వారికి అందజేశారు. విందు అనంతరం ఆడపడుచులకు మా ఇంటి గౌరవం అంటూ లోకేష్ మహిళలకు మంగళగిరి పట్టుచీరలు అందించారు. ఈ విందు సమావేశానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ (ఒంగోలు), కందుల నారాయణరెడ్డి (మార్కాపురం), ముత్తుముల అశోక్‌రెడ్డి (గిద్దలూరు), ముక్కు ఉగ్రనరసింహారెడ్డి (కనిగిరి), ఇంటూరి నాగేశ్వరరావు (కందుకూరు), బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, మంత్రి అనగాని సత్యప్రసాద్ (రేపల్లె), మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి (కొండపి), మంత్రి గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి), ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు (వేమూరు), ఏలూరి సాంబశివరావు (పర్చూరు), ఎంఎం కొండయ్య యాదవ్ (చీరాల), వేగేసన నరేంద్రవర్మరాజు (బాపట్ల), బీఎన్ విజయ్ కుమార్ (సంతనూతలపాడు) హాజరయ్యారు.





## ఇంటి పన్నుల వసూళ్లపై క్షేత్రస్థాయిలో పర్యటన







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 19)

మండలంలోని వీరేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కందుకూరు డిఎల్పిఓ, ఉలవపాడు ఎంపీడీవో గురువారం రోజున పర్యటించడం జరిగింది. గ్రామంలో జరుగుతున్నటువంటి ఐవీఆర్ఎస్ డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ , ఇంటి పన్నుల వసూళ్లపై క్షేత్రస్థాయిలో పర్యటించి సూచనలు జారీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మై టీడీపీ యాప్ పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, సిఎస్‌పురం, ఫిబ్రవరి 19)

ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు, కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం మై టీడీపీ యాప్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మై టీడీపీ యాప్ పై పూర్తి అవగాహన కల్గి ఉండాలని, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి ఫలాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, సింగిల్ విండో అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, సిఎస్ పురం పట్టణ అధ్యక్షుడు వెంకటాద్రి, జిల్లా పార్లమెంట్ కార్యదర్శి ఎన్ సి చెన్నమ్మ, మాలకొండయ్య, 23 గ్రామ పంచాయతీలు, టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు ముందస్తుగా ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ





పరిశీలించారు. ఈ నెల 25వ తేదీన దోర్నాల మండలంలో జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేసి, ఎలాంటి లోపాలు లేకుండా సమగ్రంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొత్తూరులోని హెలిప్యాడ్ ప్రదేశం, సభ వేదిక, పార్కింగ్ ప్రాంతాలను, సీఎం కాన్వాయ్ రూట్, చుట్టు ఉన్న ప్రాంతములను క్షుణ్ణంగా



పరిశీలించి అక్కడ జరుగుతున్న అన్ని ఏర్పాట్లను సమీక్షించారు. ఇంకా తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ గారు వీఐపీల వాహనాల రాక, సభా వేదిక ఏర్పాటు ప్రదేశం, పార్కింగ్ ఏరియా, సీఎం ప్రవేశం, నిష్క్రమణ స్థలాలను, హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ఉన్న రూట్ ను, క్షుణ్ణంగా పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి గారి పర్యటన సందర్భంగా ఎలాంటి భద్రతా లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అభుత్అలీ, మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, వై పాలెం ఇన్స్‌పెక్టర్ అజయ్ కుమార్, ఎస్బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ సుబ్బారెడ్డి, వెలుగొండ ప్రాజెక్టు, రెవెన్యూ, ఆర్అండ్‌బి, శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈతకి వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి

దీంతో వాగులో నీటి నిల్వలు కోసం రైతులు తీసిన పెద్ద గుంతలో నీళ్లు ఉండటంతో ఈత కోసం వాగులోని గుంతలోకి దిగాడు. ఈ క్రమంలో మళ్లీ వస్తానని చెప్పి వాగు దగ్గరికి వెళ్ళిన కొడుకు సమయమైన రాకపోవటంతో తండ్రి రామారావు వెతుక్కుంటూ వాగు దగ్గరికి వచ్చాడు. శ్రీ చరణ్ బట్టలు గుంత దగ్గర కనిపించడంతో అనుమానం వచ్చి గ్రామస్తులను పిలిచాడు. దీంతో గ్రామస్తులు వచ్చి గుంతలో వెతకగా శ్రీ చరణ్ మృతదేహం లభ్యమయ్యింది. కళాశాలకు వెళ్లవలసిన కొడుకు ఈత రూపంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. శ్రీ చరణ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## రాష్ట్రవ్యాప్తంగా 22,30,730 ఉచిత వ్యవసాయ కనెక్షన్లు

25 సంవత్సరాల పాటు ఒకే విధమైన టారిఫ్‌తో విద్యుత్ అందించవచ్చని మంత్రి తెలిపారు. ఫీడర్ లెవల్ సోలార్ ప్రాజెక్టుల కోసం భూ సేకరణ జరుగుతోందని, 1035 మెగావాట్ల సామర్థ్యానికి టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు. రాబోయే మే నెల నుంచి సోలార్ ప్లాంట్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని మంత్రి స్పష్టం చేశారు. 2028--30 నాటికి 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఫీడర్ లెవల్ సోలార్ ప్లాంట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులకు ఉదయం వేళల్లోనే 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించగలమని మంత్రి చెప్పారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార వర్గాలతో పాటు రైతులకు కూడా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడమే విద్యుత్‌శాఖ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాల స్థాయిని పెంచాలని విజ్ఞప్తి**

**పడకల సంఖ్యను 100 నుంచి 300కు పెంచాలని కోరిన ఎమ్మెల్యే**

**సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు**





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 19)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో కలిశారు. కందుకూరులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల స్థాయిని పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2003లో చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి హోదాలో 100 పడకల వైద్యశాలగా మార్చిన సంగతిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేశారు. మూడు నియోజకవర్గాలకు చెందిన రోగులు ఏరియా వైద్యశాలకు వస్తున్నారని, పెరిగిన జనాభా దృష్ట్యా ఆసుపత్రి స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు. పడకల సంఖ్యను 300కు పెంచాలని కోరారు. అలాగే పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న కందుకూరు ప్రాంతానికి, ప్రస్తుతం వైద్యశాలలో సదుపాయాలు సరిపోవటం లేదని, పడకలతో పాటు ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి అందించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, త్వరలోనే ఆసుపత్రి స్థాయిని పెంచేలా సహకారం అందిస్తానని నిర్ణయం ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

## ఏసిపి కిరణ్ కుమార్ ని కలిసిన ఆర్యవైశ్య ప్రముఖులు

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 19)

తెలంగాణ రిటైర్డ్ డిఐజి గుణశేఖర్ రెడ్డి, క్రైమ్ బ్రాంచ్ ఏసిపి కిరణ్ కుమార్‌లు హైదరాబాదు నుండి తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో బద్వేల్ పట్టణంలోని శివ టెక్స్టైల్స్ యజమాని తులసి వెంకట శివ నారాయణ గృహానికి విచ్చేశారు. వారిని మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి సుబ్బారావు, సంజీవని హాస్పిటల్ డాక్టర్ కోటా సుమన్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, ఆవోపా సెక్రెటరీ సివి నాగేశ్వరరావు, అడ్వకేట్ పత్తి నాగేంద్రప్రసాద్, తుమ్మలపెంట సురేష్ బాబు, సృజన్, పబ్బతి సత్యనారాయణ, జొన్నలగడ్డ సుధాకర్ పబ్బతి చక్రపాణి, కొలిశెట్టి సుబ్రహ్మణ్యం తో పాటు పలువురు మర్యాదపూర్వకంగా







కలిసి శాలువాతో సత్కరించి వారికి స్వాగతం పలికారు. అనంతరం అక్కడ అల్పాహార విందులో పాల్గొని అక్కడి నుండి బయలుదేరి హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఈ సందర్భంగా ఏసిపి కిరణ్ కుమార్ మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో ఆర్యవైశ్యులు అందరూ తాము ఎప్పుడు వచ్చినా ప్రేమతో అందరూ మమ్మల్ని ఆదరించి తమ పై అభిమానం చాటుకోవడం సంతోషకరమన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా తాము అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేస్తవారిపేటకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు జక్కా సుబ్రహ్మణ్యం, నిఖిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేయాలి

## కలెక్టర్ రాజాబాబు







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 19)

ఈనెల 25వ తేదీన దోర్నాల మండలంలో జరగనున్న ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారందోర్నాల మండలంలోని గంటావానిపల్లి, కొత్తూరు గ్రామాల్లో ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబుతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యంగా గంటావాని పల్లెలో ముఖ్యమంత్రి శంకు స్థాపన చేయనున్న ఫిడర్ కెనాల్ వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కొత్తూరు లోని హెలిఫ్యాడ్ స్థలం వద్ద అధికారు లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 500 కోట్లరూపాయలతో వెలుగొండ ఫీడర్ కెనాల్ పనులను సీఎం శంకుస్థాపన చేస్తారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబు వివరించారు. సీఎం పర్యటనలో ఎలాంటి భద్రతా లోపాలు లేకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈయన వెంట మార్కాపురం జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, వెలిగొండ ప్రాజెక్టు ఎస్ఈ అభుత్ ఆలీ, పంచాయతీరాజ్ ఈఈ సుబ్బారెడ్డి, వెలుగొండ ప్రాజెక్టు, రెవెన్యూ, ఆర్అండ్‌బి, శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిని ఆక్రమించారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 19)

తనకు పూర్తి హక్కులు కలిగిన ఇంటిలోకి రానీయకుండా తనకు ఆస్తి అమ్మిన వారి కుమారులు, కూతుళ్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మూర్తిశెట్టి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని సుజాతనగర్ రెండో లైన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంగిశెట్టి వెంకటేశ్వర్లు దగ్గర 2002వ సంవత్సరంలో ఇంటిని కొనుగోలు చేశానని, తనకు రిజిస్ట్రేషన్ అయిన రెండు నెలలకు ఇంటి యజమాని మరణించడంతో ఆయన కుమారులు, కుమార్తెలు తనను ఇంటిలోకి రానీయకుండా అడ్డుకుంటూ కోర్టులో కేసు వేశారని ఆరోపించారు. తనకు ఉన్న పూర్తి హక్కులతో ఉన్న డాక్యుమెంట్స్‌తో కోర్టును ఆశ్రయించగా కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టులు, కేసులు చుట్టూ తిరగలేక వారి బాధపడలేక తాను రావినూతల రవితేజ అనే వ్యక్తికి అమ్మడం జరిగిందన్నారు. అయితే రవితేజ ఇల్లు బాగు చేయించుకునేందుకు సుజాతనగర్ రెండో లైన్‌కి వెళ్ళగా ఎలాంటి హక్కులు లేని వారు వచ్చి తమను బెదిరించి సోషల్ మీడియాలో భూ కబ్జా చేస్తున్నారని ప్రచారం చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. అయితే తనకు పూర్తి హక్కులు కలిగిన తన ఇంటిని రక్షించుకునేందుకు తనకు న్యాయం చేయాలని వారు కోరారు. రవితేజ మాట్లాడుతూ మూర్తి శెట్టి వెంకటేశ్వర్లు వద్ద ఇల్లు కొనుగోలు చేసానని ఆయన ఇంటిని ఆక్రమించలేదని అన్నారు. కావాలని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారి పై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. తాను కొన్న ఇంటికి తనకు పూర్తి హక్కులు ఉన్నాయని తెలిపారు.

# వైపాలెం టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు సత్కారం

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 19)



శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవాని దేవస్థానం వద్ద అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో భాగంగా 25 లక్షల రూపాయలతో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం దగ్గర అనుమతులు సాధించిన యర్రగుడపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబును ఆలయ కమిటీ అధ్యక్షులు గుమ్మా గంగరాజు యాదవ్ ఘనంగా సన్మానించారు. ఇప్పటికే రూ.30 లక్షల వ్యయంతో విద్యుత్ స్తంభాలను 2025 సంవత్సరం తిరుణాలకు ఏర్పాటు చేయించడంతో పాటు ఈ సంవత్సరం తిరుణాలకు కమిటీ వారి కోరిక మేరకు యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు ప్రాంత యాదవుల చిరకాల కోరిక అయిన సుమారు రూ.18 లక్షల విలువైన ఓవర్ హెడ్ ట్యాంక్ విత్ పవర్ బోరును, మరో రూ.30 లక్షల వ్యయంతో ఒక్కొక్కటి మూడు లక్షల రూపాయలు విలువైనటువంటి స్వచ్ఛభారత్ బయో లెట్రిన్లను కూడా మంజూరు చేయించిన శ్రీ కాటమరాజు స్వామి భక్తుడైన ఎరిక్షన్ బాబుకు ఈ చిరు సన్మానాన్ని చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ తెలియజేశారు. మార్చి నెల మొదటి వారంలో కాటంరాజు ఆలయ సందర్శనకు వివిధ శాఖల అధికారులతో వచ్చి మార్చి 18వ తేదీ జరగనున్న కాటంరాజు గంగమ్మ తిరుణాళ్లను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తానని, సుమారు లక్షన్నర పైగా వస్తున్నటువంటి భక్తుల యొక్క సౌకర్యార్థం వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సౌజన్యంతో సేవలందిస్తామని ఈ సందర్భంగా ఇన్చార్జి హామీ ఇచ్చారు. మార్చి నెల మొదటి వారంలోనే రూ.25 లక్షలు కేటాయింపుతో బీసీ కమ్యూనిటీ హాల్ కి కూడా శంకుస్థాపన చేస్తారని వారు తెలియజేశారు. వారికి అభినందనలు తెలియజేశారు. సన్మానించిన వారిలో ఆలయ ముఖ్య బాధ్యులు పిఎల్‌పి యాదవ్, మార్కాపురం తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్, ఆలయ కమిటీ కోశాధికారి గోసు వెంకట సుబ్బారావు యాదవ్, ఉపాధ్యక్షులు పాముల పోలేరాజు, పెద్దిరాజు యాదవ్, గంగుల ఎల్లయ్య యాదవ్, ఆత్మానంద యాదవ్, పాలంకయ్య యాదవ్, బోరిగొర్ల గాలయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 19)

మండలంలోని కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ కరేడు1 సచివాలయం పరిధిలోని ఏపీ టీ డబ్ల్యూఆర్ఎస్ బాయ్స్ హాస్టల్‌ను గురువారం సందర్శించారు. మార్చి 16న నిర్వహించే పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్ వాష్, క్లీన్ ఫుడ్ గురించి విద్యార్థులకు తెలిపారు. ఆరోగ్యం బాగాలేని విద్యార్థులకు మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్వో లక్ష్మీనారాయణ, ఆరోగ్య సిబ్బంది, స్కూల్ హెడ్ మాస్టర్ పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి న్యాయవాదుల సహకరించాలి

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 19)

మార్చి 14వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి న్యాయవాదుల సహకరించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. గురువారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో గల బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులతో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని ప్రసంగించారు. గత జాతీయ లోక్ అదాలత్ నందు మొదటి ఐదు స్థానాలలో ప్రకాశం జిల్లాలను నిలిపిన న్యాయవాదులు అదేవిధంగా ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి సహకరించి ఈ జాతీయ లోక్ అదాలత్ కూడా విజయవంతం కావడానికి వారి యొక్క సహకారం అందించాలని అన్నారు. అదేవిధంగా జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ పడిన కేసులలో, కోర్టులో కట్టిన ఫీజు తిరిగి ఇవ్వబడుతుందని ఈ విషయం మీద కక్షిధాలుకు న్యాయవాదులు అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డు భాస్కరరావు అదనపు గవర్నమెంట్ న్యాయవాది బోడపాటి శివరామకృష్ణ ఇతర సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస నాయుడు, రాజశేఖర్ రెడ్డి, దండే కృష్ణారావు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

# మండల ట్రక్ ఆటో వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘం

## నూతన కార్యవర్గ ఎన్నిక





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 19)

మండలం నూతన మినీ ట్రాన్స్ పోర్ట్ ట్రక్ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలో ట్రక్ ఆటో వర్కర్స్ మినీ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 13 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా షేక్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శిగా ప్రళయ కావేరి బాబు, కోశాధికారిగా సుదర్శి రమేష్, ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ట్రక్ ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు సుమారు 40 మంది పాల్గొన్నారు.

# ఆప్కో చేనేత స్టాల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే దామచర్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 19)

అమరావతిలోని ఆసెంబ్లీ ఆవరణలో గురువారం ఆప్కో చేనేత స్టాల్‌ను సహచర శాసనసభ్యులుతో కలిసి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సందర్శించారు.

# అడివి పేరంటాలమ్మ తల్లిని దర్శించుకున్న పిచ్చిరెడ్డి



(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, ఫిబ్రవరి 19)

మండల పరిధిలోని మురుగమ్మి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ అడివి పేరంటాలమ్మ తల్లిని గురువారం సింగిల్ విండో మెంబర్, టిడిపి సీనియర్ నాయకులు ఉండేలా పిచ్చిరెడ్డి కుటుంబ సమేతంగా పేరంటాలమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# కందుకూరులో జేసీ విస్తృత పర్యటన

## అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల సందర్శన

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 19)

జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి గురువారం కందుకూరు పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఉప్పుచెరువు, కృష్ణానగర్, విజయనగర్ కాలనీలలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను, ఆహార సరుకుల నిల్వను తనిఖీ చేసి, మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం పెడుతున్నారా లేదా అని పరిశీలించారు. పిల్లలతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్థానికంగా ఉన్న పిల్లల తల్లులతో కూడా జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. చిన్ననాటి నుంచే పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా బలమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వారికి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కూడా జాయింట్ కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారిలోని విద్యా ప్రమాణాలను పరిశీలించారు. తరగతికి తగినట్లుగా విద్యార్థులలో ప్రమాణాలు పెంచేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధించాలని టీచర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో ఆమె వెంట సబ్ కలెక్టర్ హిమవంశీ, ఇతర అధికారులు ఉన్నారు.









# పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాంలు అందజేసిన శివశక్తి ఫౌండేషన్

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 19)

వినుకొండ మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు, ఆయన సతీమణి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి ఆదేశాల మేరకు శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినుకొండ మునిసిపల్ కార్మికులకు శివశక్తి ఫౌండేషన్ వారు యూనిఫాంలు అందజేయటం అభినందనీయమన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు - లీలావతి దంపతులు అందిస్తున్న సేవలు ఈ ప్రాంత ప్రజలు మరువలేనివన్నారు. పట్టణ పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణన్ని అందించే పారిశుద్ధ్య కార్మికులను గౌరవిస్తూ యూనిఫామ్‌లు అందిస్తున్న శివశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా 180 మంది కార్మికులకు యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ ఫణి కుమార్, పొలిటికల్ మేనేజర్ దిలీప్, చైర్మన్ దస్తగిరి షకీలా, రోశయ్య, టిడిపి నాయకులు పివి సురేష్ బాబు, నంది నరసింహారావు, సానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.







# ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

## పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 19)


రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలనిపల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. గురువారం వినుకొండలో మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 21వ తేదీనరాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఉన్నందున అధికారులు సన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా వినుకొండ పట్టణ ప్రాంతంలో పర్యటించనున్నారని అన్నారు. ఈ సందర్భంగా అన్ని కార్యాలయాలు, కార్యాలయ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.అందుకు సంబంధించి ఆయా జిల్లా అధికారులు నివేదికలను తయారుచేయాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. సభా వేదిక ప్రాంగణం, హెలిపాడ్, లను జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరం







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 19)

నేరాల నియంత్రణే, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. నేర నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించడం కోసం ప్రతీ రోజు నైట్ పెట్రోలింగ్ విధులు కొనసాగుతున్నాయి. కింది స్థాయి సిబ్బంది నుండి ఎస్ఐలు, సిఐలు, డీఎస్పీల దాకా రాత్రి వేళ మరింత అప్రమత్తతో గస్తీ విధులు, పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. బీట్ తనిఖీ అధికారులు, సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి రవాణా వివరాలు, కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అక్రమ రవాణాను అరికట్టే చర్యలు తీసుకుంటున్నారు. బీట్ తనిఖీ అధికారులు తరచూ బీట్ పాయింట్స్ తనిఖీ చేసి, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎటువంటి నేరాలు జరగకుండా పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించేలా చేస్తున్నారు.



లాడ్జి రూమ్స్‌లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలో ఉంటున్న వారి అధార్ కార్డు పరిశీలించి వారు వివరాలు సేకరించారు. లాడ్జిలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేసి అనుమానాస్పద, కొత్త వ్యక్తుల యొక్క వివరాలు ఆరా తీశారు. పాత నేరస్తులు, అనుమానితులు, చెడునడత కలిగిన వారి పై నిఘాను పెడుతున్నారు. మొబైల్ చెక్ డివైస్ ద్వారా అనుమానితులను చెక్ చేస్తున్నారు. దొంగతనాలు, చట్టవ్యతిరేఖ, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ కట్టడి చేస్తున్నారు. దేవాలయాలు, ఎటిఎం కేంద్రాలు, ఇతర ముఖ్య వ్యాపార సముదాయాలు వద్ద అప్రమత్తంగా తిరుగుతూ అనుమానాస్పద వ్యక్తులను విచారించి తనిఖీ చేస్తున్నారు. రాత్రి పూట దొంగతనాలు, అల్లర్లు, గొడవలు జరగకుండా, కారణం లేకుండా రాత్రి వేళ తిరిగే ఆకతాయిల పై మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే తెల్లవారు జామున వెహికిల్ డ్రైవర్లు తరచూ స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూస్తున్నారు.

# ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అవార్డుకు ఎంపికైన నాగేండ్ల వెంకట సుబ్బారెడ్డి

(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 19)


బద్వేలు నియోజకవర్గం, ఎత్తిరాజుపల్లె గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేండ్ల వెంకట సుబ్బారెడ్డి 2026 సంవత్సరానికి గాను ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరుమీద ప్రధానం చేసే అవార్డుకు ఎంపికయ్యారు. వాజ్‌పేయి, అద్వానీ సేవా సంస్థ వ్యవస్థాపకులు పాలకొలను పీరారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా సమాజంలో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వారికి ఆన్‌లైన్ ద్వారా ఈ అవార్డులు ప్రధానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా జర్నలిస్టుగా, అలాగే అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ సమాజ సేవలో ముందుండి పనిచేస్తున్న వెంకట సుబ్బారెడ్డిని ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేయడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా నాగేండ్ల వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛందంగా సమాజంలో చేస్తున్న సేవలను గుర్తించి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరుతో అవార్డు అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని తెలిపారు. అలాగే వాజ్‌పేయి, అద్వానీ సేవా సంస్థ వ్యవస్థాపకులు పాలకొలను పీరారెడ్డికి, తనకు ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బిఎస్ నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జిల్లాలో 24న సైక్లింగ్ జిల్లా స్థాయి పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 19)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు సైక్లింగ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు ఒంగోలులోని డాక్టర్ పి ఆనంద్ మినీ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ పోటీలలో 18 సంవత్సరాలకు పైబడిన వారు నుండి మాస్టర్స్ విభాగం వరకు క్రీడాకారులు పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు ముందస్తుగా క్రీడా యాప్‌లో నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలని అధికారులు సూచించారు. నమోదు చేసుకున్న వారికే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక అవుతారు. రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలు ఈ నెల 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఎన్‌టిఆర్ జిల్లాలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి రాజరాజేశ్వరి తెలిపారు. పూర్తి వివరాల కోసం 9121106840 నంబర్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

# శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 19)

బద్వేల్ పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో ఉన్న శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్ర యోధుడిగా, హిందూ ధర్మ పరిరక్షకుడిగా ఖ్యాతి గాంచిన శివాజీ మహారాజ్ జీవిత విశేషాలను స్మరించుకుంటూ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల గౌరవ అధ్యక్షులు కొండపల్లి వెంకట సుభాష్ కుమార్, ప్రధాన కార్యదర్శి పెద్ది సుధాకర్, సంచాలక సమితి కార్యదర్శి బోలా నారాయణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యం వహించారు. విశిష్ట అతిథులుగా కుప్పం వెంకట సుబ్బారావు, గానుగపెంట రమేష్ బాబు, పూనిపర్తి అనిల్ కుమార్ రాజు, బాసికాల నారాయణ, గోగుల నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వక్తలు శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలను, దేశభక్తిని వివరించి విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. జయంతి సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

# మోహన్ పార్థివదేహానికి నివాళులు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఫిబ్రవరి 19)

మండలంలోని బద్వేటి చెర్లోపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు మనవడు మోహన్ ఆకస్మికంగా మృతి చెందారు. మరణ వార్త తెలుసుకున్న యర్రగొండపాలెం టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మోహన్ పార్థివదేహానికి నివాళులు అర్పించి మోహన్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఇన్‌ఛార్జితో పాటు మండల టీడీపీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ అకుమల్ల శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు గుమ్మా గంగరాజు, జడ్డా రవి, ఎంపిటిసి దండ వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెన్న వెంకటరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

# మునిసిపల్ పన్నులు నూరుశాతం వసూలు చేయాలి

## కమిషనర్ పర్వతనేని శ్రీధర్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 19)

కనిగిరి పురపాలకసంఘం పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థలం, నీటి కుళాయిల పన్నులు నూరుశాతం వసూలు చేయాలని మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. గురువారం పురపాకసంఘం కార్యాలయంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ ఆస్థి, నీటి కుళాయి పన్నులు, యూజర్ చార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు మరింత వేగవంతం చేయాలన్నారు. అధిక మొత్తంలో ఉన్న ఇంటి పన్నులు బకాయి ఉన్నవారిని గుర్తించి పన్నులు వసూలు చేయాలన్నారు. నూతనంగా నిర్మించిన గృహాలను గుర్తించి వెంటనే పన్నులు వేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి తెలిపారు. హెచ్చు మొత్తంలో నీటి పన్ను బకాయులు చెల్లించని గృహాలను గుర్తించి కనెక్షన్ తొలగించాలన్నారు. మునిసిపల్ అనుమతి లేకుండా అక్రమంగా తీసుకున్న కుళాయిలను గుర్తించి వారికి వెంటనే నోటీసులు ఇచ్చి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయాల వారీగా ఇప్పటివరకు వసూలు వివరాలు గురించి తెలుసుకున్నారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. సూచించిన గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజనీర్ కోటేశ్వరరావు, ఆర్.ఐ ప్రదీప్, మునిసిపల్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి పథకం పై నోరు విప్పరెందుకు? పిసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

## వేల్పూరు గ్రామంలో షర్మిల "రచ్చబండ"

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 19)

పేదల జీవితాల్లో ఎన్నో మార్పులు తెచ్చిన ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి ప్రధాని నరేంద్రమోదీ తీరని అన్యాయం చేస్తున్నారని కాంగ్రెస్పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. వినుకొండ నియోజకవర్గం, శావల్యాపురం మండలం, వేల్పూరు గ్రామంలో గురువారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఎంతో మంది పేదల కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని చంపుతుంటే జగన్ నోరువిప్పకపోవడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ పథకం వచ్చాక గ్రామాల్లో కరువు, కాటకాలు, వలసలు, ఆకలిచావులు తప్పాయని షర్మిల అభిప్రాయపడ్డారు. పేదల కడుపు నింపే ఉపాధిపై బీజేపీ కుట్రలు చేస్తుందని ధ్వజమెత్తారు. పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలని చూస్తున్నారని, కొత్త చట్టం తెచ్చి గ్రామాల్లో ఉపాధి లేకుండా చేశారని విమర్శించారు. వీబీజీరామీజీ పథకం తెచ్చి రాష్ట్రాల నెత్తిన 40 శాతం భారం మోపారన్నారు. రాష్ట్రం ఇప్పటికే 11 లక్షల కోట్ల అప్పుల్లో ఉందిదని, ఏటా ప్రభుత్వం నడవాలి అంటే 1 లక్ష కోట్ల అప్పులు తేవాల్సి ఉండగా జరుగుతున్న అన్యాయంపై మోదీ నిర్ణయాల పై బాబు, జగన్, పవన్ నోరు మెదపరని, రాష్ట్రానికి నష్టం జరుగుతున్నా వ్యతిరేఖించటం లేదని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలి అంటే మళ్లీ కాంగ్రెస్ అధికారంలో రావాలి అని షర్మిల రచ్చబండలో పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయుకులు షేక్ మస్తాన్ వలి, వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బోయపాటి రామాంజనేయులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల శ్రీనివాస్ యాదవ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖ అధికారిగా టివి నాగలక్ష్మి




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 19)

మార్కాపురం జిల్లా ఇంచార్జి రవాణాశాఖ అధికారిగా టివి నాగలక్ష్మి గురువారం సాయంత్రం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పని సరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టూ వీలర్స్ పై ప్రయాణించేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే పరిధికి మించి వేగం వెళ్లకూడదని అన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే ఫెనాల్టీతో పాటు లైసెన్ కూడా రద్దు చేస్తామని కూడా ఆమె హెచ్చరించారు. జిల్లా రవాణా శాఖ అధికారి బాధ్యతలు చేపట్టిన నాగలక్ష్మికి కార్యాలయం సిబ్బంది బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

## లఢక్‌లో ఎవరెస్టు శిక్షణకు బద్వేలు విద్యార్థి ఎంపిక

### కడప జిల్లా నుంచి ఏకైక విద్యార్థిగా వెంకీ కి అవకాశం



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 18)

ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించేందుకు లఢక్‌లో నిర్వహించనున్న 12 రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి బద్వేలు ప్రభుత్వ భవిత ట్రైనింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థి వై వెంకీ ఎంపికైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి మల్లేశ్వరి తెలిపారు. కడప జిల్లా నుంచి ఏకైక విద్యార్థిగా వెంకీ ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఎవరెస్టు అధిరోహణపై ఆసక్తి గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణల ద్వారా ఎంపిక చేస్తోంది. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రోత్సహించేందుకు గండికోటలోని అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ ద్వారా రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చి, అర్హులైన వారిని లఢక్‌లో జరిగే 12 రోజుల శిక్షణకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

## లబ్ధిదారులకు సంఘం డైరీ బీమా సొమ్ము పంపిణీ



(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, ఫిబ్రవరి 19)

ములకలూరు సంఘం డైరీలో పాలు పోస్తున్న లబ్ధిదారురాలు మరణించడంతో కుటుంబ సభ్యులకు సంఘం డైరీ బీమా రూ.60 వేల రూపాయలను వినుకొండ సంఘం డైరీ మేనేజర్ మక్కెన జానకి రామారావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ డైరీలో పాలు పోస్తున్న లబ్ధిదారులందరూ బీమా పథకంలో చేరాలని, సంఘం డైరీ అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కంచర్ల వెంకటస్వామి, సూపర్వైజర్ ఘంటా కిరణ్, కంచర్ల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టియు నిర్వహించే "చలో విజయవాడ" ను జయప్రదం చేయండి

### ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దేశా నాయక్ పిలుపు




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 19)

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మూడు దశల ఉద్యమంలో భాగంగా మొదటి దశ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కే శామ్యూల్ మాట్లాడుతూ రెండవ దశ జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. జిల్లా కార్యదర్శి ఆర్ మాలకొండ నాయక్ మాట్లాడతూ మూడవ దశ ఫిబ్రవరి 25 న చలో విజయవాడ కార్యక్రమాన్ని మార్కాపురం జిల్లాలోని ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసింది గా ఉపాధ్యాయులను కోరడమైనది జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దేశా నాయక్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల మేనిఫెస్టో ఇచ్చిన హామీ అమలు కోరుతూ అపరిష్కృతంగా ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వము చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు 30% ఫిట్మెట్ తో వెంటనే వేతన కమిషన్ ను నియమించాలని పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏలను ప్రకటించాలని సిపిఎస్ విధానాన్ని రద్దు పరిచి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని కేజీబీవీలు గురుకులాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల యొక్క సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ మంజూరు చేయాలని ప్రభుత్వానికి కోరారు. మూడో దశ ఉద్యమంలో భాగంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డి తిరుపతి నాయక్, వైవి సుబ్బారావు, శ్రీనివాసులు, జీవీ నర్సయ్య, ఆత్మనంద, ప్రభాకర్, సతీష్, కలాం, రామ్మోహన్‌రావు, రవీంద్ర, ఎంజె ప్రసాద్, దేవ ప్రసాద్, మురళీ, గోపాల్, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, జే వెంకటేశ్వర్లు, రవీంద్ర, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎం వినుకొండ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఫిబ్రవరి 19)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 21వ తేదీన వినుకొండ పట్టణంలో పర్యటించనున్నారు. "స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఆయన విచ్చేసి, పట్టణంలో పారిశుద్ధ్య పనులు, అభివృద్ధి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం పర్యటన ఏర్పాట్లను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఎం బహిరంగ సభ నిర్వహించనున్న గ్రౌండ్‌ను సందర్శించిన జీవీ, వేదిక నిర్మాణం, ప్రజల కోసం చేయాల్సిన సౌకర్యాల పై అధికారులకు సూచనలు చేశారు. సీఎం హెలికాప్టర్ దిగేందుకు సిద్ధం చేస్తున్న జూనియర్ కాలేజీ గ్రౌండ్‌ను పరిశీలించి భద్రతా పరమైన చర్యల పై ఆరా తీశారు. జూనియర్ కాలేజీ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కూడా ఆయన సందర్శించారు. జీవీ మాట్లాడుతూ పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.









## వాలిచర్ల, నందనవనం సచివాలయాల ఆకస్మిక తనిఖీ





(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఫిబ్రవరి 19)

మండల పరిధిలోని వాలిచర్ల, నందనవనం సచివాలయాలను మండల పరిషత్ అధికారి రంగ సుబ్బరాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, సిటిజన్ ఈ కేవైసీ, అక్షర ఆంధ్రపై రివ్యూ చేసారు. సమయపాలన పాటించవలసిందిగా సిబ్బందికి సూచనలు జారీ చేసారు.

## వరి సాగు, ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించిన జేసీ కల్పనాకుమారి





(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 19)

జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి గురువారం జరుగుమల్లి మండలంలో పర్యటించారు. కె బిట్రగుంట గ్రామంలో వరి సాగు, ఈ–పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి లభించే రాయితీ, ఇతర ప్రయోజనాలకు ఈ – పంట ప్రామాణికం కాబట్టి రైతులందరూ తప్పనిసరిగా ఈ – పంటలో తమ పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ – పంట వివరాల నమోదులో పొరపాట్లు లేకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ పర్యటనలో ఆమె వెంట జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు ఉన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com